సిస్టర్ వేదావతి

డాక్టరు పిశిపాటి వెంకటరమణయ్య

వేదావతి భర్త రాసిన విల్లు ప్రకారం పది వేలొచ్చే చిన్న యెస్టేటుకంతా హక్కుదారాలయింది. “నా అన్నవారెవరుకూడా లేకపోవచ్చును గాని, అప్తులన్నవారు కూడా యెవరూ కనిపించకపోవడమే ఆశ్చర్యం వేస్తుంది. పనిలేందీ యెవరినికూడా యింటికి చేరనివ్వదు. తనసలే యెవరింటికికూడా వెళ్లేటట్టే కనిపించదు. ఎవరితోనైనా మాట్లాడవలసివచ్చినా అవసరాన్నిమించి ఒకపలుకైనా ఆడేదికాదు. ఇంట్లో రాజభోగోపచారాలకవసరమైన నౌకర్లెందరవసరమో అందరినీ పెట్టింది. ఆనౌకర్లయినా యెవరిడ్యూటీ వారుచేసుకపోవలసిందే కాని అనవసర ప్రసంగాల కెడమిచ్చేదేకాదు. సాయంకాలం అయిదయ్యేసరికి షోఫరు కారు నద్దంలాతుడిచి వాకిటముందు తెచ్చిపెట్టేవాడు. ఏ కారణంచేతైనా యజమానురాలారోజున హవాకోరికి వెళ్లడం మానేసిందంటే కారు నలాగే తనడ్యూటీప్రకారం ఏడుగంటలదాకా పెట్టి యెదురుచూస్తూ కూర్చొవుండవలసిందేకాని, బయల్దేర్తారా లేదా అని అడగడంకాని, లేకుంటే కారణమేమైయుంటుందా కనుక్కోవాలని ఆదుర్దాపడ్డట్టుంటేకాని ఇంపీరియల్ సర్వీసులా నెలతిరిగేటప్పటికల్లా మొదటి తేదీకి బిల్లకుషుముల్లా చేతిలోపడే ముప్పై రూపాయలకూ నీళ్లొదులుకోవలసిందన్నమాటే! ఎవరిడ్యూటీవాండ్లు చేసుకపోతుంటే అంతకన్నా సుఖమైన నౌకరీ లేకపోవడంచేత, పైగా యింకోచోట దొరికే జీతానికన్నా నాలుగురాళ్లెక్కువగా దొరుకుతూవుండడంచేత, ఆమెకొలువును మానుకోవడమంటే వాండ్లకు కష్టంగాతోచేది. అందుకనే, పేదవారనే దయాదాక్షిణ్యాలు హృదయంలోనే కాని, పైకి చంపివేస్తుందేమోననే భయముండడంచేత, యజమానురాలుసంగ తలావుంచి, వారిలోవారైనా అనవసరపుమాటలు పెట్టుకోకుండా ఒకఆఫీసులా గృహకృత్యాలు నిర్వహించుకొంటూ పొయ్యేవారు.

ఆ ఇల్లు అసలే దేవిడీలాంటి పెద్ద భవనము. అవసరమైనచోట పెంచి లేనిచోట పడగొట్టి యెప్పుడూ యేవో యింటిమరమ్మత్తులు తాను స్వయంగాదగ్గరనిలుచోని చేయిస్తూవుండడమో, కోటగోడలావుండేఆపెద్దకాంపౌండు ఆవరణలో రకరకాల పూలచెట్లు పెట్టించడమో, స్వహస్తాలతోటి తీగలు మలుపుతూ లతానికుంజాలను తయారుచేస్తూనో బంగళానంతా దేవేంద్రభవనంలా తయారుచేస్తూ కాలక్షేపంచేస్తూవుండేది. మానవమాత్రుడితో నవ్వుతూ వికాసంగా

మాట్లాడిమెరుగకపోయినా ఆ లతానికుంజాలతో ఆపూలమొక్కలతో ఆగులాబీ పూలతో తన సహజసౌందర్యమంతా వెల్లివిరిసేట్టటి ముఖవిలాసంతో మాట్లాడుతూ, ఆలింగనాలుచేస్తూ ప్రకృతిసౌందర్యంలో మునిగిపోతూవుండేది. బెంగుళూరు చిలకపచ్చచీరగట్టి, ముఖాన బొట్టు తల్లో పూలు పెట్టధన్న మాటే కాని, చేతికి బంగారుగొలుసుగాజులకుతోడు చిన్నబంగారురిస్టువాచీ, మెళ్లో సన్నని గడి

ఆ పూలమొక్కలమధ్య తిరుగుతూవుంటే వనలక్ష్మిలాగే వుండేది.

యారపుగొలుసు, నడుముకు తనమేనికాంతిని మించి తళతళమెఱిసే బంగారపువడ్డాణం, పెట్టుకొని, ఆ సవితాదేవిలాంటికండ్లతో, తుమ్మెదరెక్కలాంటి ఆ జారుశిఖతో పంచవన్నెలచిల్కలా ఆ పూలమొక్కలమధ్య తిరుగుతూవుంటే వనలక్ష్మిలాగే వుండేది.

అయితే ఆమె జీవితాదర్శమేమిటో ఎవరికీ తెలేదు. ఆ బ్రహ్మాండమైన మహలు, ఆ మెఱిసిపొయ్యేదీపాలు, ఆ నిగనిగలాడే మఖమల్ సోఫాలు కుర్చీలు, ఆ నిలువుటద్దాలు డ్రెస్సింగుటేబిల్సు, రాత్రిళ్లుకూడా పట్టపగలులా వెలుగుతూవుండే దీపపుకాంతులలో ఇరవైనాలుగ్గంటలూ తన సౌందర్యాన్ని చెక్కుచెదరకుండా దిద్దుకొని మురుస్తూ ఒక్కమానవ పురుగునైనా దగ్గర నమ్మనీకుండా యెవరికొరకు నిరీక్షిస్తూవున్నట్టో? అలాంటిఅదృష్టశాలి యీ మానవప్రపంచంలో యేమూలైనా వున్నట్టిచిహ్నంగూడా కనిపించదు!

పురుషోత్తమరావుగారు కంచర్లపూడి సంస్థానానికి దివానుగావుండి మంచి పేరుకీర్తులు సంపాదించుకొన్నారు. సంస్థానాధీశుడు వీరిని గురువుగా పూజించేవాడు. రైతులు వీరిని తండ్రిలా ప్రేమించేవారు. శాస్త్రపూర్వాచారపరాయణుడే అయినప్పటికీ సంఘసంస్కరణాలపట్ల సానుభూతి కలిగేవుండేవారు. అప్పు డేమనోదౌర్బల్యం కలిగిందోకాని జీవితాని కంతా కళంకం తెచ్చే

పనొకటి చేశారు. పాతికముప్పైయేళ్లు ప్రథమ భార్యతో సర్వసంసారసుఖాలూ అనుభవించి, యాభైయేళ్లొచ్చినతరువాత మళ్లాయిప్పుడు పెళ్లేమిటని కొన్నాళ్లూరుకొనిగూడా కార్యాంతరాలచేత గ్రామాంతరం వెళ్లి అప్సరస లాంటి పదమూడేండ్లపిల్ల వేదావతిని వివాహమాడి రెండోమానవుడికి తెలియకుండా చక్కావచ్చారు! కళంకభూయిష్ఠమయిన తన మలిన హస్తాలతో, ఆ అనాఘ్రాతపుష్పాన్ని కూడా మలినంచేసే మహాపాతకాన్ని వడిగట్టుకోడమెందుకనో, తానుచేసిన మహాపరాధాన్ని భరింపలేకనో, అకస్మాత్తుగా గుండువంటి పురుషోత్తమరావుగారు గుండెజబ్బుచేత, నిషేకముహూర్తప్రయత్నాలలో వుండగానే కండ్లుమూశారు. కావలసినంత ఆస్తి సంపాదించిపెట్టి సంతానమేమీ లేకుండా స్వర్గస్థులయినవారి కింక వారసులకు కొఱవేముంది? అయిన వారూ కానివారూ అందరూ వంశవృక్షాలు చేతబట్టుకోని బయలుదేరేరు! అయితే అప్పటికి సంవత్సరంనాడే తన మనోదౌర్బల్యంచేత తన జీవితంలోచేసిన యీ మహాపరాధానికి తను క్షంతవ్యుడుకాడనీ, తన యావదాస్తికిని వేదావతి సర్వస్వతంత్రురాలుగా వుండగలదనిన్నీ ఇంతేగాక భగవంతుడనేవాడే వొకడున్నపక్షమున, వేదావతి తననిరర్థకపు జీవితమును భోగవంతముగచేసికొనే ప్రయత్నాలలో, నిజంగా సంభవించే మహాపాతకాలేమైనా వున్నప్పటికీ, వాటికన్నిటికినీ తననే బాధ్యుణ్ణిగాచేసి ఆమెను క్షమింపవలసివుంటుందనీ విల్లురాసి, రిజిష్టరు కూడా చేసిపెట్టారు. దీన్నిబట్టే యిప్పుడు వేదావతి సర్వసంఘపరిత్యాగం చేసి జీవితాన్నీవిధంగా నెట్టుకపోతూవుండడము.

తల్లిదండ్రులు తన్నుబలిచ్చి యీ మహాదైశ్వర్యాన్నంతా అనుభవించాలనేదుర్మార్గప్రవృత్తికి తలపడ్డ కలుషాత్ములని కాబోలు వారి నెవరినీ గడపైనా త్రొక్కనివ్వకపోవడము. స్వశక్తిచే కష్టపడి సంపాదించుకొన్న ఆస్తిని, జీవిత సర్వస్వమును ధారబోసి తనే దైవమని నమ్ముకొన్న భార్యకూడా దక్కకుండా అపహరించాలనే దురాశాపూరితులనీ, వాండ్ల ముఖం చూడ్డం కూడా మహాపాతకమనీ కాబోలు భర్తవైపువారి నెవరినీ కూడా వాకిటిముందుకూడా రానివ్వకపోవడము. మానవుల నందరినీ సమానంగా సృష్టించి ప్రకృతివైభవాన్ని ప్రసాదించి సర్వసుఖాలను అనుభవించుకోవలసినదిగా భగవంతుడనుగ్రహిస్తే, సంఘ దురాచారాలనెన్నిటినో తెచ్చిపెట్టి స్వార్థపరులై, మానవస్వాతంత్ర్యాన్నరికడుతున్నారనేఆగ్రహంతో కాబోలు , దేవేంద్రభోగాలతో సమానమైన వైభవాలన్నీ అనుభవిస్తూ వుండడము.

మానవుల మనోనిశ్చయాలు దృఢసంకల్పాలు ప్రకృతివాహినికి యెదురీదకుండా వుండేఅంతవరకేగాని అదేపాటి యెదురు తిరిగినా నదీనాంసాగరోగతిగానే పరిణమిస్తుంది. వేదావతి తన సౌఖ్యంకొరకు

యెన్ని యేర్పాట్లో గావించుకొంది. ధనానికా లోపంలేదు. సాలు తిరిగేటప్పటికి పదివే లింటికి తెచ్చి క్రుమ్మరించిపోతారు. ఒక్కమనిషి. ఏ సంసారజంజాటమూ లేదు. కాని ఆమె నేదో మనస్సు బాధిస్తూనే వున్నట్టు కనిపిస్తుంది. హంసతూలికాతల్పంలాటి పందిరి పట్టెమంచంమీద కూర్చొని నిలువుటద్దంలో తన సౌందర్యవిలాసాలను చూచుకొంటూ, ముంగురులు పైకొత్తుకొంటూనో, అసలే దానిమ్మపువ్వులాంటి కాంతి గలిగిన తన పెదవి కంటిన తమ్మరసపుకాంతిచే ద్విగుణీకరించిన సొబగును పదే పదే పెదవిసాచి చూచుకొంటూనో, హఠాత్తుగా, యేదో దీర్ఘాలోచనాపరురాలయి చెక్కిట చెయి చేర్చి బొమ్మలా అలాగే కూర్చొని గంటల తరబడి ఉండిపొయ్యేది. ఏ హంసతూలికా తల్పము, ఏ ధనము తన మనోవ్యధను మాన్పేటందుకు తోడ్పడజాలనట్టు కనిపించేది.

క్రమేణా యీ కూర్చొని ఆలోచించడాలు - పిలిస్తే వినిపించుకోలేక పోవడము, రెప్పవాల్చకుండా అలాగే చూడడం, వెర్రి వెర్రి నవ్వులు నవ్వడం, అంతలోనే యేడవడం, స్పృహతప్పి పడిపోయి గంటలతరబడి తన్నుకొంటూ కట్టెలా నీలుక్కుపోవడంలోకి దిగింది. దేవిడీలో యెన్నాళ్లనుండో దయ్యాలకావాసంగావుండే చీకటికొట్టులన్నిటినీ పడగొట్టించడంచేత, వాటికి కోపంవచ్చి యిప్పుడీమెను ఆవహించా యని కొందరూ, పురుషోత్తంరావుగారి ప్రథమభార్య దయ్యమై పట్టిం దని మరికొందరూ, తలకొకమాట నౌకర్లనుకుంటూవచ్చారు! ఆరోజు నౌకర్లెన్ని ఉపచారాలుచేసినా వేదావతికి స్పృహ వచ్చిందికాదు. తరుచు యిలా వస్తూవుండడం, ఆరోజుకారోజు శల్యగతం కావడం చూచి, యజమానురాలి అనుజ్ఞకు నిరీక్షించకే, డాక్టరును పిలిపించారు. డాక్టరు వచ్చి రెండు గంటలకాలం ఉపచారాలు చేసినమీదట కాస్త కండ్లు తెరిచి చూచింది. తన నరుసు నారోజు అక్కడేవుంచి తిరిగి సాయంకాలమువచ్చి చూస్తానని చెప్పి వెళ్లారు. వేదావతి కంతా స్వప్నావస్థక్రింద కనిపించింది. తను చూచియుండిన ఆదివ్య సుందరవిగ్రహము కలలో కనిపించిందా, లేక మైకంలో కళ్లు తెరచి చూచినప్పుడు కనిపించిన డాక్టరు విగ్రహమా అని సందేహం కలిగింది.

సాయంకాలం నాలుగ్గంటలయింది. బంగళాముందు మోటారుచప్పు డయింది. నరుసు డాక్టరొస్తున్నాడని చెప్పగానే వేదావతికి గుండె దడ దడ కొట్టుకో మొదలు పెట్టింది ఎందుచేతనో. లేచికూర్చోబోతుంటే నరుసు నివారించి కదలకుండా అలాగేపడుకోబెట్టింది. ఇంతలోకే తన స్వప్న పురుషుడు ప్రత్యక్ష మయినట్లు డాక్టరుగా రొచ్చి ముందు నిలిచారు. ఆ బ్రహ్మ వర్చస్సు,

ఆబాగారు మేనికాంతి, విదేశాలనుండీ తిరిగి వచ్చిన ఆ క్రొత్త మాయని దుస్తుల వైఖరి, ఆ చలాకీతనం చూచి వేదావతి సమ్మోదిత అయిపోయింది. నాడి పరీక్షించి నవ్వుతూ



నాడి పరీక్షించి నవ్వుతూ భుజముపై తడుతూ మరేంభయం

భుజముపైన తడుతూ 'మరేం భయం లేదు లెండి. యింక లేచి తిరగవచ్చు. రేపు వచ్చి మళ్లా చూచిపోతాను. ఈ మందుమాత్రం సరిగా పుచ్చుకొంటూ వుండం'డని నరుసును వెంటబెట్టుకొని వెళ్లిపోయినాడు. వేదావతికి ఆరాత్రంతా డాక్టరుగారు రావడము, ఆ ధైర్య మివ్వడము, ఆమాటా ఆపలుకూ వైఖరీ వీటి ఆలోచనలతోటే సరిపోయింది. క్రమేణా డాక్టరుగారి రాకపోకలుమాత్రం ఆబాగళాలో నిరభ్యంతరంగా జరిగిపోతూవచ్చాయి. సాయంకాలం తనమోటారులోనే వేదావతిని హవాకొరకి తీసికొనివెళ్లడం, ప్రొద్దుపోయిన రోజున వేదావతితోనే అక్కడ భోజనం చెయ్యడం, పగలు తన దవాఖానాకు తీసికొనివెళ్లి, తనుచేస్తూవుండే ఆపరేషన్లు చూపుతూ, నరుసులు రోగుల నెంతప్రేమతో చూస్తూ పోషిస్తూవుంటారో చూపి, పగలప్పుడప్పుడు తనబంగళాయందే భోజనానికి నిలుపుకోడం, యిలా కొంతకాలం గడచిపోయింది. వేదావతి కాజబ్బుమాత్రం తిరిగి యెన్నడూ పొడజూపలేదు! ఏరోజైనా డాక్టరుగారు కనిపించనిరోజున కాస్త సుస్తీగా వుండడము తప్ప! డాక్టరుగారితో యీమాటా ఆమాటా మాట్లాడుతూ మాటలమధ్య భర్త తనపేర వ్రాసినవిల్లులోని "తనసౌఖ్యంకొఱకు" అనావాక్యాలను నొక్కిచూపుతూ వుండేది. దానితత్త్వం గ్రహించి డాక్టరుగారు కూడా దానిమీ దేవో ఖులాసాకబుర్లు చెబుతూ, సంఘసంస్కారము, విదేశాలలో స్త్రీల కెట్టి స్వాతంత్ర్య ముండేది, తను విదేశాలలో యెలా ఖులాసాగా కాలక్షేపంచేస్తూవచ్చింది, ఏవేవో కబుర్లలోకి దింపి మనసు కానందం కలిగిస్తూవచ్చేవారు. పునర్వివాహాలు దోషం కావని, మన దేశంలోకూడా విడాకులచట్టం ప్రవేశపెడితేనేకాని యీపురుషుల దౌర్జన్యం

కొంతతగ్గదేమోనని, యేమేమో మాట్లాడుతూవచ్చేవారు. వేదావతికి యీకబుర్లన్నీ వింటంచేత డాక్టరుగారిమీద తిన్నగా మోహం మరలింది.

ఆరు సంవత్సరాలు విదేశాలలో కాలం గడిపి క్రొత్తగా వచ్చిన డాక్టరుగారికి ఆడవారితో కరస్పర్శలు చేయడం, సరదాగా వెంట వేసికొని తిరగడం, కబుర్లు చెప్పడం నూతనంగా కనిపించేదేమీ లేదు. సనాతన ధర్మనిష్ఠాపరులగు హిందూ కుటుంబములో పుట్టి పెరిగి, మగపురుగు నింటికి చేర్చకుండా తదేకనిష్ఠతో కాలం గడుపుతూ నిండు జవ్వనంలోనున్న వేదావతికి అన్యథా అపోహపడడంలో ఆశ్చర్యమూలేదు! తనింతకాలము పట్టుదలతో దీక్షవహించివున్నందుకు భగవంతుడుతగినసత్ఫలమందజేశాడని లోలోపల ఉప్పొంగిపోతూ వచ్చేది. కొంతకాల మిలా జరిగిపోయింది. ఒకరోజు కబుర్లమధ్య బ్రహ్మసమాజమువారి యాజమాన్యమున తన వివాహము త్వరలోనే జరుగ నిశ్చయమయిందని చెప్పి వేశారు డాక్టరుగారు. వేదావతి అలాగే ఆ మాట వినేటప్పటికి, మాటా పలుకూ లేకుండా సోఫామీద,ప్రక్కనే కూర్చొనున్న డాక్టరుగారి వొడలిమీద కొరిగింది! అవి దుఃఖాశ్రువులో, ఆనందబాష్పాలో తెలియవు. కళ్లవెంట నీరు గిర్రుమని తిరిగాయి. డాక్టరుగారు వేదావతి హృదయాన్ని గ్రహించారు. ఆమె కట్టి హృదయవేదన కలగడం డాక్టరుగారి కేమీ వింతనిపించలేదు. వేదావతిని నెమ్మతిగా లేవనెత్తి వోదార్చి అసలు విషయాన్నంతా చెప్పివేశారు.

"మీరు నన్ను అన్యథా తలంపకుడు. తా నొకటి తలిస్తే దైవ మొకటి తలచినట్లయింది. మీ కారోగ్యాన్ని కలిగించడానికే నేను మీతో యింతచనువుతీసికొనితిరగడం, కులాసాకబుర్లు చెబుతూ మీ కానందం కలిగిస్తూరావడం! ఏ అడవినో కందమూలాలు తింటూ కాలక్షేపంచేస్తూవచ్చిన శకుంతలవంటి కన్యకకు దుష్యంతుణ్ణి చూడగానే మనోవైకల్యం కలిగిందంటే, రాజభోగాలననుభవించి చీకూచింతాలేని యౌవనవతులు జితేంద్రియత్వంకొఱకు తంటాలుపడటం వట్టి వెఱ్ఱిభ్రాంతి. ఇది ప్రకృతివిరుద్ధంకూడా. కనుకనే అనుభవవేత్తలగు పంతులవారు తమ విల్లునందు ఆవాక్యాలను పొందుపరిచింది. మీరు తప్పక తగిన వరుని చూచుకొని వివాహమాడుటసర్వోత్కృష్టమైన పని. ఇది దైవసమ్మతమనే తలంపుడు. లేకున్న మీ ఆరోగ్యమునకుకూడ భంగమువాటిల్లి తుదకు మీరధఃపతితు లగుదురు. మరొకవిషాద వార్తనుకూడ చెబుతాను వినండి. ఈ ప్రపంచమున మీకన్న నా కాప్తులయినవా రెవరూ లేరు. శ్రీపంతులవారి పోషకవర్గమున వారి మఱద లొక.బాలవితంతు వుండేది. ఆమెకూ వారికినీ వుండేసంబంధము వారి యితరసద్గుణ సంపత్తిచే బహిర్లోకమునకు ప్రకాశితము

కాలేదు. కొంతకాలమునకు, మెవ రేవిధిని సంచరించినను ప్రకృతి తనవిధిని తాను

ఇదే మీపాదములకు నమస్కరించుచున్నాడను.

నెరవేర్చుకొనుచునే పోవుచుండును గనుక, ఆమె గర్భవతియైనది. రెండవమార్గ మవలంబించక యే తీర్థయాత్రలనెపముననో ఆమెను క్రైస్తవమిషను వారి కప్పగించి ప్రసవించిన తోడనే శిశువును వారివద్ద భద్రపరిపించి, యింటికి పిలిపించివేశారు. ఆశిశువుకు వలయు యేర్పాట్లన్నీ గావించి అవసరపుపట్ల చాలుకు పదివేలవంతునకూడ ఆశిశువుకొఱకు ఖర్చు పెడుతూ రెండవమానవునికి తెలియకుండా మానేజిచేశారంటే మీ కాశ్చర్యం వెయ్య వచ్చు. అప్పడాభార్యా మరదలూ మరణించినమీదటే మిమ్ము వివాహమాడి యుండినది. ఇప్పడాతండ్రిని నేనెట్లు ద్రోహము చేయుట కొడిగట్టగలను? మీరు నాకు తల్లిసమానులు. ఇదే మీపాదములకు నమస్కరించుచున్నాడను. నన్నాశీర్వదించుడు."

కొద్దికాలమునకే, మహాత్ముని ఆదర్శ ప్రకారము సిస్టరువేదావతి చాలుకు పదివేలొచ్చే తనయెస్టేటును, యాభైవేలకు మించు తనస్వంతభవనమును హరిజనోద్ధరణముకొఱకును, అనాథబాలబాలికల పోషణముకొఱకును భూరిదాన మొసగినదని, ఏ పత్రిక చూచినా అదేవార్త!